

వైద్యులకు రక్షణ కల్పించాలి

24 గంటలూ అందుబాటులో ఉంటూ రోగులకు వైద్య సేవలందించే వైద్యులకు, వైద్యసిబ్బందికి రక్షణ కల్పించాలి. కోల్‌కతాలో జరిగిన సంఘటన పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ వైద్యశాలల వద్ద సిబ్బందికి రక్షణ కల్పించేలా పోలీసు శాఖ ద్వారా చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ మహబూబ్ షరీఫ్, కంభం





మహిళా డాక్టర్‌లకు రక్షణ కల్పించాలి

మహిళా డాక్టర్లకు భద్రత కల్పించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. చాలా మంది వైద్యశాలలకు మద్యం తాగి వస్తున్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటే చాలా మంచిది. పోలీస్ సిబ్బంది రాత్రి, పగలు వైద్యశాలలకు వచ్చి వెళ్లాలి. సిబ్బందికి ధైర్యం చెప్పాలి.

– కె.సునీత, వైద్యాధికారి, దొనకొండ

క్లుప్తంగా

31న పింఛన్ల పంపిణీ

కొమరోలు: ఈ నెల 31వ తేదీ శనివారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ డి.నరసయ్య తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీన ఆదివారం కావడంతో ఆగస్టు 31వ తేదీన పింఛన్‌దారులకు పింఛన్లు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని సంబంధిత గ్రామ సచివాలయ సిబ్బంది చేపడతారని, మండలంలోని లబ్ధిదారులు అందుబాటులో ఉండాలని ఆయన కోరారు.

పింఛన్ సొమ్మును బ్యాంకుల్లో విత్‌డ్రా చేసుకోవాలి

రాచర్ల: ఈ నెల 31వ తేదీన పంపిణీ చేయాల్సిన పింఛన్ సొమ్మును శుక్రవారం 10 గంటలకు సంబంధించిన బ్యాంకుల్లో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు వెళ్లి విత్‌డ్రా చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరామిరెడ్డి గురువారం తెలిపారు. పింఛన్ సొమ్మును తీసుకున్న తర్వాత అదే రోజు గ్రామాల్లో దండోరా లేదా మైకుల ద్వారా పింఛన్‌దారులకు తెలియపరచాలన్నారు. శనివారం ఉదయం 5 గంటల నుంచి పింఛన్‌ల పంపిణీ ప్రారంభించి 99 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడా పింఛన్‌ల పంపిణీ ఆలస్యం చేయకుండా, సచివాలయ సిబ్బంది సెలవుల్లో వెళ్లకుండా పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కాకర పంట పరిశీలన



కాకర రైతులకు సూచనలిస్తున్న హెచ్‌ఓ

కంభం: కంభంలో రైతులు సాగు చేస్తున్న కాకర పంటను గురువారం ఉద్యానవన శాఖాధికారి డి.శ్వేత పరిశీలించారు. కాకర పంటకు ఎండు తెగులు సోకిందని తెగులు సోకిన తీగలు వాడిపోయి ఎండిపోతాయన్నారు. నివారణకు ఒక శాతం కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి 3గ్రా చొప్పున కలిపిన ద్రావణాన్ని మొక్క మొదలు చుట్టూ నేల తడిచేలా పోసుకోవాలని తెలిపారు. పది రోజుల వ్యవధిలో ఇలా 2–3 సార్లు చేయాలన్నారు. శిలీంద్రం భూమిలో ఉంటుందని పంట మార్పిడి చేసుకోవడం మంచిదని సూచించారు.

గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన



పిల్లలకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

గిద్దలూరు రూరల్: మండలంలోని వెళ్లుపల్లె ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో గురువారం కమ్యూనిటీ వైద్యాధికారి డాక్టర్ శివిబాయి చిన్న పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ అభం శుభం తెలియని బాల బాలికలపై అఘాయిత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. బంధువులైనా, అపరిచిత వ్యక్తులైనా తమను ఎక్కడ తాకితే మంచి, ఎక్కడ తాకితే చెడ్డది అనే విషయంపై చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



మార్కాపురం బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినుల శాస్త్రీయ నృత్య ప్రదర్శన



కంభం: హజరత్‌గూడెం పాఠశాలలో..



చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

మార్కాపురం టౌన్: తెలుగు భాషలో పట్టు సాధించినట్లయితే ఇతర ఏ భాషనైనా సులువుగా నేర్చుకోవచ్చని జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగురామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు భాష ఔన్నత్యం తెలిపేలా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కేవలం ఐదు నిమిషాల్లో 50 పద్యాలను అలవోకగా పలికిన విద్యార్థులు చంద్రిక, శ్రీవిద్య, ఫర్హానా, ఉపాధ్యాయ బృందాన్ని ఆమె అభినందించారు.

■ కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కేజీబీవీ, జెడ్పీ ఉన్నత పాఠశాల, నాగంపల్లి యూపీ పాఠశాలలో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేజీబీవీలో ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యాన్ చంద్ చిత్ర పటాలకు నివాళులర్పించారు. జెడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం విజయలక్ష్మి, యూపీ పాఠశాలలో హెచ్‌ఎం వెంకటేశ్వరనాయక్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

■ పొదిలి: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గిడుగు రామమూర్తి పంతులు, ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు



గొట్లగట్టు కేజీబీవీలో..

గునుపూడి భాస్కర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఎస్ కుమార్, మాజీ ఉప సర్పంచ్ షేక్.జిలానీ, వాసవీ క్లబ్ మహిళా అధ్యక్షురాలు సోమిశెట్టి శ్రీదేవి, విద్యాకమిటీ చైర్‌పర్సన్ వీరిశెట్టి ఆదిలక్ష్మి, వైస్ చైర్మన్ తాళ్లూరి మత్తయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ తర్లుపాడు: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

■ కొమరోలు: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తెలుగుభాష దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ పాఠశాలలో తెలుగుభాష దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకటరామ్మూర్తి చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ బందుగుల సుబ్బారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి మాట్లాడుతూ మాతృభాషను ఎవరూ మరువవద్దని తెలిపారు. అనంతరం తెలుగు భాష గొప్పదనాన్ని తెలియచేస్తూ విద్యార్థులు వేసిన నృత్యాలు, నాటికలు ఎంతగానో అలరించాయి. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ రేవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ కంభం: తెలుగుభాషా దినోత్సవాన్ని గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హజరత్ గూడెం ప్రధానోపాధ్యాయురాలు సరోజ మాట్లాడుతూ భాషా నైపుణ్యాలు భావ వ్యక్తీకరణకు వంతెనగా నిలిచి ఉంటాయని, భాషపై పట్టు సాధించిన వారు మెట్టు మెట్టును అలవోకగా అధిరోహించగలరన్నారు. విద్యార్థులకు వేమన శతక పుస్తకాలు అందజేశారు. పాఠశాలలో పాటలు, పద బంధాలు, పద్య కవితలు, అష్టావధానాలు నిర్వహించారు.

■ రాచర్ల: గిడుగు రామ్మూర్తి జయంతి, తెలుగుభాషా దినోత్సవాన్ని మండల కేంద్రం రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీఎల్ రామానాయక్ మాట్లాడుతూ గిడుగు వెంకట రామ్మూర్తి తెలుగుభాషకు చేసిన కృషి గురించి విద్యార్థులకు తెలియజేశారు. తెలుగుభాషకు చేసిన కృషికి గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని తెలుగుభాష దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం గిడుగు వెంకటరామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయులు పి.రమణారెడ్డి పాల్గొన్నారు.

■ గిద్దలూరు రూరల్: విద్యార్థులు తెలుగు భాషపై ఆసక్తి చూపాలని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోలా నాగభూషణ్ రెడ్డి అన్నారు. తెలుగు భాష దినోత్సవం, క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం పాఠశాల ఆవరణలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాకీ క్రీడకు ఎనలేని సేవలను అందించిన మేజర్ ధ్యాన్‌చంద్, తెలుగు భాషకు కృషి చేసిన గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి జన్మదినం సందర్భంగా మనమందరం ఈ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రతి విద్యార్థి అంకిత భావంతో విద్యను అభ్యసించాలన్నారు. తెలుగు భాషతో పాటుగా క్రీడలపై ప్రత్యేక ఆసక్తి చూపాలన్నారు. ఉపాధ్యాయులు గుర్రం శోభన్, భారతి, ధనలక్ష్మి, సుధా, రేవతి, సుభాన్‌ఖాన్, అరుణకుమారి పాల్గొన్నారు.



కొమరోలు: విద్యార్థినుల నృత్యం



నాగంపల్లి యూపీ పాఠశాలలో..



పొదిలిలో గిడుగుకు నివాళులర్పిస్తున్న భాస్కర్ తదితరులు



లక్ష్మక్కపల్లి పాఠశాలలో గిడుగు చిత్రపటానికి నివాళి

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



రెయిన్‌బో డ్రిల్‌లో పాల్గొన్న విద్యార్థులు



గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం తిరుపతిరెడ్డి

మార్కాపురం: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి, క్రీడా దినోత్సవం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు, వ్యాయామం దోహదపడతాయని పాఠశాల పీడీ డి.శ్యామలదేవి అన్నారు. ధ్యాన్‌చంద్‌పై నిర్వహించిన వక్తృత్వ పోటీలు, చెస్, జిమ్నాస్టిక్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. రెయిన్‌బో కలర్ గొడుగులతో నిర్వహించిన డ్రిల్ అందరినీ ఆకట్టుకుంది. ఈ ఏడాది పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థినులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని ఎక్స్‌లెన్సీ అవార్డు పొందడం అభినందనీయమని డీవైఈవో చంద్రమౌళి పేర్కొన్నారు. పీడీ శ్యామలదేవి, ఉమాదేవిను అభినందించారు. మండలంలోని కస్తూర్బా గాంధీ స్కూల్లో ఘనంగా క్రీడా దినోత్సవం నిర్వహించారు.

ఘనంగా గిడుగు, ధ్యానచంద్ జయంతి

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్, జెడ్పీ బాలుర హైస్కూల్లో మాతృభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు కర్నాటి తిరుపతిరెడ్డి, ఎంఎస్ శర్మలు మాట్లాడుతూ గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని వాడుక భాషలోకి తీసుకొచ్చి భాషను సరళతరం చేసిన మహనీయుడు, సంఘ సంస్కర్త, చరిత్రకారుడు గిడుగు అన్నారు. క్రీడలకు వన్నె తెచ్చిన ధ్యాన్‌చంద్ జయంతిని క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు చాక్లెట్స్ పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ ఏలూరికి టైమ్స్ ఎక్సలెన్స్ అవార్డు



మంత్రి భరత్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న రామచంద్రారెడ్డి

మార్కాపురం: మార్కాపురం పట్టణానికి చెందిన ప్రముఖ ఫార్మా కంపెనీ యజమాని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డికి టైమ్స్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. బుధవారం రాత్రి విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి టీజీ భరత్ చేతులమీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. డాక్టర్ రామచంద్రారెడ్డి ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్టు ద్వారా గత ఐదేళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. కరోనా సమయంలో ఏపీతోపాటు తెలంగాణ, కర్నాటక, తమిళనాడులో పర్యటించి లక్షలాది మాస్కులు, వేలాది మందికి శానిటైజర్లు, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించారు. ఆయన సేవలకుగాను టైమ్స్ సంస్థ సోషల్ సర్వీస్ కేటగిరీలో అవార్డు ప్రదానం చేసింది. భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని డాక్టర్ ఏలూరి పేర్కొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ భూలక్ష్మి, పక్కన జెడ్పీటీసీ సభ్యురాలు ఇందిర

తర్లుపాడు: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీపీ భూలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇందిర స్పష్టం చేశారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలు కార్యాలయాల చుట్టూ తిప్పకుండా వారి సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. సర్పంచ్‌లు పెద్ద మస్తాన్, శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి తమ గ్రామాల్లో సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. తర్లుపాడు మీదుగా బస్సు సర్వీసులు నడపాలని సర్పంచ్‌లు కోరారు. గ్రామాల్లో కుక్కలు, కోతుల బెడద నుంచి ప్రజలను రక్షించాలని విజ్ఞప్తి చేశారు. తాడివారిపల్లి జెడ్పీ పాఠశాలలో కనీసం ఒక మహిళ ఉపాధ్యాయురాలినైనా నియమించాలని సర్పంచ్ జాన్‌రత్నం కోరారు. అధికారులు తీర్మానాలను చదివి వినిపించారు. ఎంపీడీఓ నరసింహులు, ఈవోఆర్‌డీ బాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



నాడు.. ఆస్పత్రి ఆవరణలో నిలిచి ఉన్న వర్షం నీరు



నేడు.. మురుగు గుంతను పూడ్చుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం: మార్కాపురం జీజీహెచ్‌లో పారిశుధ్యం మెరుగుపరుస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ పి.సావిత్రి పేర్కొన్నారు. జీజీహెచ్‌లో అధ్వానంగా ఉన్న పారిశుధ్యంపై ఈ నెల 24న 'సాక్షి'లో "సమస్యల రొద.. రోగుల వ్యథ" శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందించి చర్యలు చేపట్టారు. గురువారం ఆమె వైద్యశాల ఆవరణ మొత్తం తిరిగి సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మురుగు గుంతలను మట్టితో పూడ్పించి నీరు నిల్వలేకుండా చేశారు. కాలువల్లో మురుగు సాఫీగా పోయేందుకు చర్యలు చేపట్టారు.

రేపు రామదూత క్షేత్రంలో శనీశ్వరునికి పూజలు

కొనకనమిట్ల: మండల కేంద్రమైన కొనకనమిట్ల సమీపంలోని రామదూత క్షేత్రంలో శనివారం శని త్రయోదశి సందర్భంగా శనీశ్వరునికి అష్టోత్తర శత కలశాభిషేకం, అలంకరణ, శాంతి హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు, యక్కంటి తిరుపతిరెడ్డి తెలిపారు. ఉభయదాతల పర్యవేక్షణలో శనీశ్వరునికి తైలాభిషేకం వైభవంగా నిర్వహిస్తారని, భక్తులందరూ పాల్గొనాలని కోరారు.

ఇన్‌చార్జి సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయండి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్, వార్డు సభ్యులు

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం కె.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇమ్మడి శ్రీరాములు అనారోగ్యరీత్యా సుదీర్ఘంగా సెలవు పెట్టారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి సర్పంచ్‌గా మట్టం వెంకటేశ్వర్లును జిల్లా అధికారులు నియమించారు. అయితే ఇన్‌చార్జి సర్పంచ్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఆర్థిక సంఘం, సాధారణ నిధులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు, ఏకగ్రీవ తీర్మానాల ద్వారా చేపట్టారని, పంచాయతీ సెక్రటరీతో కలిసి అవినీతికి పాల్పడుతున్నారని ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. పంచాయతీకి వచ్చే నిధులను ఈవోపీఆర్, ఆర్‌డీ అనుసంధానంతో చెక్ పవర్ జోడించాలని వార్డు సభ్యులు కోరారు. గ్రామంలో అవినీతికి పాల్పడుతున్న ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ ఇమ్మడి శ్రీరాములు ఎంపీడీఓకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

మినీ థియేటర్ ప్రారంభం

పెద్దదోర్నాల: మండల కేంద్రం పెద్దదోర్నాలలో గురువారం మినీ సినిమా థియేటర్ ప్రారంభమైంది. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మండల కేంద్రంలో ఓ టూరింగ్ టాకీసు ఉండేది. మండల ప్రజలకు అప్పట్లో అదే వినోదాన్ని అందించే సాధనం. అది శిథిలావస్థకు చేరినప్పటి నుంచి ఎవరూ థియేటర్‌ను నిర్మించలేదు. నూతనంగా నిర్మించిన ఈ థియేటర్‌తో కొంగొంత సినిమాలు చూసే అవకాశం ఉండటంతో మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు నల్లమల ఘాట్‌లో శ్రీశైలానికి ప్రయాణంపై నిషేధం ఉండటంతో యాత్రికులు ఇక్కడే వేచి ఉండాల్సి ఉంటుంది. దీంతో రాత్రి వేళ్లో 9 గంటల తర్వాత ఆలస్యంగా వచ్చిన ప్రతి వాహనం మండల కేంద్రంలో నిలిచి పోవాల్సిందే. దీంతో అటువంటి ప్రయాణికులకు సినిమా థియేటర్ ఎంతో ఉపయోగకరంగా మారనుంది.

దరిమడుగు ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ



వైద్యశాల రికార్డులు తనిఖీ చేస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ నాగేంద్రరెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం రూరల్: మండలంలోని దరిమడుగు గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని గురువారం హెల్త్ సూపర్‌వైజర్ నాగేంద్రరెడ్డి తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో లేకపోవడంపై 'సిబ్బంది ఇలా.. వైద్యసేవలు ఎలా' అనే శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. వైద్య సిబ్బంది తిప్పాయపాలెం పీహెచ్‌సీలో సమావేశానికి వెళ్లారని, మరోసారి ఇలాంటివి జరగకుండా జాగ్రత్త వహిస్తామని చెప్పారు. గ్రామంలో వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో రోజూ వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. వైద్యశాల పరిసర ప్రాంతాల్లో ఆకతాయిలు మద్యం సేవిస్తున్న విషయాన్ని పోలీసులకు తెలియజేశామన్నారు.